క్లుప్తంగా

నియామకం



రూప్లానాయక్, అధ్యక్షుడు



ప్రకాశ్‌నాయక్, ప్రధాన కార్యదర్శి

దండేపల్లి: తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడిగా దండేపల్లి మండలం కుందేల్‌పహాడ్ టీడబ్ల్యూ పీఎస్ హెచ్‌ఎం రూప్లానాయక్, ప్రధాన కార్యదర్శిగా కాసిపేట మండలం చింతగూడ పాఠశాల ఉపాధ్యాయుడు ప్రకాశ్‌నాయక్ నియమితులయ్యారు. ఈమేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్‌నాయక్ శుక్రవారం నియామకపత్రాలు అందించారు. త్వరలో జిల్లా పూర్తి కమిటీతోపాటు, మండల కమిటీలను ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్

చెన్నూర్‌రూరల్: మండలంలోని బావురావుపేటలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ చల్ల రాంరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యాన్ని విక్రయించాలన్నారు. సర్పంచ్ ముత్యాల మౌనిక, సంపత్, ఎంపీటీసీ బండం శ్రీనివాస్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

24న మహాపడి పూజ

చెన్నూర్: పట్టణంలోని జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌లో ఈనెల 24న కేరళ సంజీవ్ నంబూద్రి ఆధ్వర్యంలో మహాపడి పూజ నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప సేవా సమితి సభ్యులు తెలిపారు. ఉదయం 8 గంటలకు సహస్ర కలశాభిషేకం అనంతరం అన్నదానం, సాయంత్రం 5 గంటల నుంచి అయ్యప్ప స్వామి ఆలయం నుంచి హైస్కూల్ గ్రౌండ్ వరకు కేరళ వాయిద్యాలు, కోలాటాల బృందంతో అఖండ దీపం శోభాయాత్ర ఉంటుందని పేర్కొన్నారు. సాయంత్రం 6 గంటలకు మహాపడి పూజ, తర్వాత అగ్నిగుండాలు, అల్పాహార వితరణ ఉంటుందని తెలిపారు. అయ్యప్ప స్వాములు, భక్తులు హాజరు కావాలని కోరారు.

ప్రభుత్వ సంఘాలు గెలిస్తే కార్మిక హక్కులు హరిస్తాయి



మాట్లాడుతున్న సత్యనారాయణ

మందమర్రిరూరల్: ప్రభుత్వ అనుబంధ కార్మిక సంఘాలు గుర్తింపు కార్మిక సంఘంగా గెలిపిస్తే రాజకీయ జోక్యంతో కార్మిక హక్కులు హరించుకుపోతాయని ఏఐటీయూసీ మందమర్రి ఏరియా బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. ఏరియాలోని కేకే-ఓసీ వద్ద శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓసీ కార్మికులకు హెచ్‌ఆర్‌ఏ రావాలన్నా, సొంతింటి కల నెరవేరాలన్నా, ఐటీ రిటర్న్ యాజమాన్యమే తిరిగి చెల్లించాలన్నా ఏఐటీయూసీ చుక్క గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. సమావేశంలో సంఘం నాయకులు సుదర్శన్, కుమారస్వామి, రాజేష్‌యాదవ్, తిరుపతి, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న రఘునాథ్

మంచిర్యాలటౌన్: బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి జన్మదిన వేడుకలు పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సీఏ ఫంక్షన్‌హాల్‌లో బీజేపీ కార్యకర్తలు శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని 176 మంది రక్తదానం చేశారు. రక్తదాతలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ సర్టిఫికెట్లు అందించారు. అనంతరం కేక్ కట్ చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ భాస్కర్‌రెడ్డి, సభ్యులు మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్, రాధాకృష్ణ, కిషన్, తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్రసంయుక్త కార్యదర్శి రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

జన్నారంలో బట్టర్ ఫ్లై గార్డెన్

- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- ఇప్పటికే పలు ప్రాంతాల్లో పర్యటన



జన్నారంలో బట్టర్‌ఫ్లై గార్డెన్ కోసం నాటిన మొక్కలు

జన్నారం: పర్యాటకులకు మరింత ఆహ్లాదం పంచేందుకు అటవీశాఖ మరో అడుగు ముందుకు వేసింది. ఇప్పటికే కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో పలు నిర్మాణాలు చేపట్టి అభివృద్ధి చేయగా, తాజాగా అధికారులు జన్నారంలో బట్టర్‌ఫ్లై గార్డెన్ నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే గార్డెనింగ్, విశ్రాంతి తీసుకునేందుకు ఏర్పాట్లు, దారి తదితర పనులు ప్రారంభించారు.

నర్సరీ స్థలం గార్డెన్‌కు..

జన్నారం అటవీ డివిజన్ కేంద్రం ఈసీ సమీపంలో నర్సరీ స్థలాన్ని అధికారులు పరిశీలించారు. ఈ స్థలాన్ని బట్టర్‌ఫ్లై గార్డెన్‌కు కేటాయించి మొక్కలు నాటారు. ప్రస్తుతం ఈసీలో వన్యప్రాణుల మ్యూజియం ఏర్పాటు చేశారు. నెమళ్లు, గార్డెనింగ్ చేసి, పర్యాటకులకు ఇక్కడ విశేషాలను వివరిస్తున్నారు. అక్కడి నుంచి నేరుగా నర్సరీకి వెళ్లేందుకు దారి చేసి, అక్కడే గార్డెన్ ఏర్పాటు చేసేందుకు అధికారులు పనులు ప్రారంభించారు.

పలు ప్రాంతాల్లో పర్యటన

జన్నారంలో బట్టర్‌ఫ్లై గార్డెన్ ఏర్పాటుపై అధికారులు పలు ప్రాంతాల్లో పర్యటించారు. రేంజ్ అధికారి హఫీజొద్దీన్, సిబ్బంది..బట్టర్ ఫ్లై గార్డెనింగ్, ఏఏ రకాల మొక్కలు పెంచాలి, ఏ మొక్కల పువ్వులకు బట్టర్ ఫ్లైలు ఆకర్షితమవుతాయనే అంశాలు నేర్చుకున్నారు. వరంగల్‌లో మ్యూజికల్ గార్డెన్, పాకల్ గార్డెన్, వరంగల్ జూ, హైదరాబాద్‌లోని హెచ్‌ఎండీఏ బట్టర్ ఫ్లై గార్డెన్‌లో పర్యటించినట్లు అధికారులు తెలిపారు.

రకరకాల బట్టర్ ఫ్లైలు

వివిధ పట్టణాల్లో పర్యటించిన అధికారులు బట్టర్ ఫ్లై రకాలు గుర్తించారు. మన ప్రాంతాల్లో తిరిగే బట్టర్ ఫ్లైలు వాటి రకాలు గుర్తించి, వాటికి అనుగుణమైన పలు మొక్కలు తీసుకువచ్చినట్లు తెలిపారు. మన ప్రాంతంలో కామన్ లేపాడ్, ప్లెయిన్ టైగర్, కామన్ లస్కర్, బ్లూ టైగర్, ఎల్లో ప్యాన్సీ, కామన్‌క్రో, చాక్లెట్, లేమన్ బట్టర్ ఫ్లై రకాలు గుర్తించారు. ఇక్కడ గార్డెన్ పూర్తయ్యాక పువ్వుల వాసనకు చుట్టుపక్కల బట్టర్ ఫ్లైలు ఇక్కడికి వచ్చి చేరుతాయని అటవీ అధికారులు తెలిపారు.



హైదరాబాద్‌లోని గార్డెన్‌లో చాక్లెట్ బట్టర్‌ఫ్లై

పనులు ప్రారంభించాం



బట్టర్‌ఫ్లై గార్డెన్ ఏర్పాటు పనులు ప్రారంభించాం. ఏఏ రకాల మొక్కలు నాటాలో వాటిని హైదరాబాద్ నుంచి తీసుకువచ్చాం. పది రకాల మొక్కలు నాటుతున్నాం. పూల వాసనకు బట్టర్ ఫ్లైలు గార్డెన్‌కు చేరుతాయి. బట్టర్ ఫ్లై గార్డెన్ పర్యాటకులు, విద్యార్థులకు ఆహ్లాదం నింపుతుంది. మరో రెండు నెలల్లో బట్టర్ ఫ్లైలు గార్డెన్ వచ్చే అవకాశం ఉంది.

– హఫీజొద్దీన్, రేంజ్ అధికారి

వంతెన పూర్తి..



సుద్దాల వాగుపై నిర్మించిన వంతెన

- ప్రారంభం కాని అప్రోచ్ రోడ్డు
- ఇరువైపులా మట్టితో రోడ్డు ఏర్పాటు

చెన్నూర్‌రూరల్: వాగుపై వంతెన లేకపోవడంతో దశాబ్దాల కాలం నుంచి ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. వర్షాకాలంలో వాగు ఉప్పొంగితే చుట్టూ తిరిగి రావాల్సిన పరిస్థితి నెలకొనేది. రైతులు వర్షాకాలంలో ఎరువులు, ఇతర వ్యవసాయ పరికరాల కోసం మండల కేంద్రానికి రావాలంటే చాలా ఇబ్బందులు పడేవారు. ఇది మండలంలోని సుద్దాల, తుర్కపల్లి, కమ్మరిపల్లి, గంగారం, దుబ్బపల్లి గ్రామాల ప్రజల దుస్థితి. సుద్దాల వాగుపై వంతెన నిర్మాణానికి రూ.10 కోట్ల నిధులు మంజూరు కాగా, గతేడాది డిసెంబర్‌లో క్రితం వంతెన పనులు ప్రాంభించి అక్టోబర్‌లో ప్రారంభించారు. దీంతో దశాబ్దాల కాలం నుంచి కష్టాలు దూరమయ్యాయి. కాని వంతెన పూర్తయినా అప్రోచ్ రోడ్డు పనులు ప్రారంభం కాలేదు. దీంతో వంతెనకు ఇరువైపులా మట్టి పోసి తాత్కాలికంగా రోడ్డు ఏర్పాటు చేయించారు. ప్రస్తుతం వంతెన పైనుంచి రాకపోకలు కొనసాగుతున్నాయి. అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి నిధులు రూ.5 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ల ప్రక్రియ పూర్తయినా పనులు ప్రారంభించలేదు. అధికారులు పట్టించుకుని త్వరగా పనులు చేపట్టేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



నిర్మాణం కాని అప్రోచ్‌రోడ్డు

వారంలోగా పనులు ప్రారంభం

సుద్దాల వాగుపై వంతెన నిర్మాణం పూర్తయింది. ప్రస్తుతానికి రాకపోకలు సాగుతున్నాయి. అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తయింది. వారంలోగా పనులు ప్రారంభమవుతాయి. త్వరగా నిర్మాణం పూర్తయ్యేలా చూస్తాం.

– భరత్, ఏఈ, ఆర్‌అండ్‌బీ

కోటపల్లిలో సామాజిక తనిఖీ ప్రజావేదిక



కోటపల్లిలో సామాజిక తనిఖీ ప్రజావేదికలో అధికారులు

కోటపల్లి: మండలంలోని 31 పంచాయతీలు, అనుబంధ గ్రామాల్లో ఏప్రిల్ 2022–23 సంవత్సరం వరకు చేపట్టిన ఉపాధి హామీ పనుల వివరాలను డీఆర్‌డీవో శేషాద్రి శుక్రవారం వెల్లడించారు. మండలకేంద్రంలో 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని వివిధ పనులకుగాను రూ.7 కోట్ల ఖర్చు చేసినట్లు తనిఖీ బృందం సభ్యులు పేర్కొన్నట్లు డీఆర్‌డీవో శేషాద్రి తెలిపారు. ఉపాధి హామీ ద్వారా చెరువులు, సాగునీటి కాలువల్లో పూడికతీత పనులతో పాటు ఫిష్‌పాండ్‌లు, నర్సరీలు, ఆయిల్‌ఫాంతోటల నిర్వహణ పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇందుకు రూ.7కోట్ల ఖర్చు చేసినట్లు తనిఖీ బృందం సభ్యులు నివేదికల్లో వెల్లడించారు. కొల్లూర్ కార్యదర్శి మధుకర్, టీఏ సతీశ్ మాస్టర్ చెల్లింపుల్లో, చేసిన పనుల్లో అవకతవకలు చేయడంతో గ్రామస్తులు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో విచారణకు ఆదేశించారు. జనగామ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి ఈజీఎస్ పనులు చేయకున్నా చేసినట్లు తప్పుడు లెక్కలు చూపడంతో రూ.లక్షా 83వేల రికవరీ, పెనాల్టీకి ఆదేశాలు జారీ చేశారు. దేవులవాడ, బబ్బరుచెల్క గ్రామాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేసుకునే వారిపేరిట కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్ తప్పులు మాస్టర్ వేసి డబ్బులు కాజేసినట్లు గుర్తించి రూ.1,71,933 రికవరీకి ఆదేశాలు జారీ చేశారు. ఇలా చేతివాటం ప్రదర్శించిన కార్యదర్శులపై అధికారులు జరిమానా విధించి చేతులు దులుపుకోవడంతో గ్రామాల ప్రజలు సామాజిక తనిఖీ కేందం వద్ద ఆందోళన చేశారు. అయినా అధికారులు రికవరీతోనే సరిపెటడంపై వారు అసహనం వ్యక్తం చేశారు. ఏపీడీ దత్తరావు, ఎంపీపీ సురేఖ, ఎంపీడీవో భాస్కర్, కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



వెలవెలబోతున్న క్యాంపు ఆఫీస్

మందమర్రిరూరల్: మందమర్రిలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ క్యాంపు ఆఫీస్ (బీ-1) వెలవెలబోతుంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ, బాల్క సుమన్ ఓటమి చెందడంతో నాయకులు ఇటు వైపు రావడం లేదు.

కట్టెల పొయ్యిలే దిక్కు

- పాఠశాలల్లో వంట గదుల్లేవ్
- చెట్ల కింద, వరండాల్లో మధ్యాహ్న భోజన తయారీ
- ఇబ్బంది పడుతున్న నిర్వాహకులు



కట్టెలు తీసుకెళ్తున్న నిర్వాహకురాలు



కట్టెల పొయ్యిపై వంట చేస్తున్న నిర్వాహకులు

నెన్నెల: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారీకి కట్టెల పొయ్యిలే దిక్కవుతున్నాయి. మధ్యాహ్న భోజనం అమలు నుంచి ఏజెన్సీ నిర్వాహకులు వంట చెరుకులతోనే వంట చేస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం గతంలో పాఠశాలలకు గ్యాస్ కనెక్షన్లు సరఫరా చేసింది. అయితే సబ్సిడీపై సిలిండర్లు అందించలేదు. దీంతో కట్టెల పొయ్యిపై వంట చేయడంతో వచ్చే పొగతో నిర్వాహకులు ఇబ్బంది పడుతున్నారు. పొయ్యిపై కట్టెలు మండక అన్నం ఉడికి, ఉడకకపోవడం, విద్యార్థులు పొగను పీల్చుతూ అనారోగ్యం బారిన పడుతున్నారు. పాఠశాలల్లో వంట గదులు లేకపోవడంతో వరండాల్లో చెట్ల కింద వంట చేయాల్సి వస్తోంది. మండలంలో 32 పాఠశాలలు ఉండగా కేవలం ఐదు పాఠశాలల్లోనే వంట గదులు ఉన్నాయి. 2,768 మంది విద్యార్థులు మండలంలో విద్యనభ్యసిస్తున్నారు. ఇందులో సుమారు 2,500 మంది ప్రతీరోజు మధ్యాహ్న భోజనం చేస్తుంటారు. గ్యాస్ కనెక్షన్లు ఇచ్చి వాటికి రాయితీ గ్యాస్ సిలిండర్లు ఇవ్వకపోవడంతో అవి వృథాగా మారుతున్నాయి.

టన్నుల కొద్ది వంట చెరుకు వినియోగం

ప్రభుత్వం హరితహారం పేరుతో మొక్కలు నాటుతుండగా ఇందుకు విరుద్ధంగా పాఠశాలల్లో టన్నుల కొద్ది వంట చెరుకును వాడుతున్నారు. హరితహారం పేరుతో రూ.లక్షలు ఖర్చు చేసి నాటిన మొక్కలపై పర్యవేక్షణ లేక ఎండిపోతున్నాయి. మరోవైపు ఉన్న కొద్దిపాటి చెట్లను వంట చెరుకు కోసం నరికి వేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలలకు రాయితీపై గ్యాస్ కనెక్షన్లు అందించేలా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రాయితీపై సిలిండర్లు ఇవ్వాలి



కట్టెల పొయ్యిపై వంట చేయడంతో పొగతో ఇబ్బందులు పడుతున్నాం. గ్యాస్ పొయ్యిపై వంట చేయడం ఎంతో సౌకర్యంగా ఉంటుంది. రాయితీపై సిలిండర్లు అందజేస్తే ఎలాంటి సమస్యలు ఉండవు.

– రామక్క, నిర్వాహకురాలు, నెన్నెల

గ్యాస్ కనెక్షన్లు ఇవ్వాలి



గతంలో ప్రభుత్వం మాకు గ్యాస్ స్టవ్‌ను అందజేసింది. కాని రాయితీపై సిలిండర్లను ఇవ్వలేదు. ప్రతీరోజు మా బడిలో 300 మందికి వంట చేస్తున్నాం. కట్టెల కొనుగోలుకు సుమారు రోజు 200 అవుతున్నాయి. ప్రభుత్వం గ్యాస్ కనెక్షన్లు ఉచితంగా అందించాలి.

– పల్ల గౌరక్క, నిర్వాహకురాలు, నెన్నెల

ఉన్నతాధికారుల దృష్టికి..



గతంలో కొన్ని పాఠశాలలకు గ్యాస్ పొయ్యిలు అందించారు. రాయితీపై సిలిండర్లు అందించకపోవడంతో నిర్వాహకులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీరి ఇబ్బందులను ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్తాం.

– మహేశ్వర్‌రెడ్డి, ఎంఈవో, నెన్నెల

కబ్జా భూములు స్వాధీనం చేసుకోవాలి

బెల్లంపల్లి: మండలంలోని కన్నాల, లక్ష్మీపూర్ శివారు ప్రాంతాల్లో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను వెంటనే అక్రమార్కుల నుంచి స్వాధీనం చేసుకోవాలని కన్నాల మాజీ సర్పంచ్ మంద అనిత డిమాండ్ చేశారు. శుక్రవారం బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణకు ఆమె వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లక్ష్మీపూర్ శివారు 112,134 సర్వే నెంబర్లలో ఉన్న విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని తెలిపారు. ఆక్రమిత భూములను చదును చేయించి ఇళ్ల నిర్మాణాలు చేశారని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ అవతారం ఎత్తి కొంతభూమిని ప్లాట్లు చేసి లక్షలాది రూపాయలకు అమ్మకాలు చేశారని వివరించారు. గతంలో అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని తెలిపారు. రూ.కోట్లు విలువ చేసే కన్నాల భూములను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. విచారణ జరిపి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అదనపు కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ కమిషనర్



రాహుల్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న భుజంగరావు

బెల్లంపల్లి: అదనపు కలెక్టర్ బి.రాహుల్‌ను బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ ఆర్.భుజంగరావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అసెంబ్లీ ఎన్నికల వేళ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన భుజంగరావు అదనపు కలెక్టర్‌ను కలవలేకపోయారు. మున్సిపల్ అభివృద్ధికి తగిన సహకారం అందించాలని ఆయన్ను కోరినట్లు భుజంగరావు తెలిపారు.

రేపు ఆయుర్వేద వైద్యశిబిరం

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలో ఆదివారం ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వైద్యుడు విశ్వనాథ మహర్షి వైద్యపరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మండల సర్వసభ్య సమావేశం

భీమిని: కన్నెపల్లి మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 17న మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాధాకిషన్ తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు నివేదికలతో హాజరుకావాలని సూచించారు.

గ్రామాల్లో బడి బయటి పిల్లల సర్వే



భీమారంలో పిల్లలతో మాట్లాడుతున్న సీఆర్పీ సాగర్ బృందం



తాండూర్: మహిళను వివరాలు అడిగి తెలుసుకుంటున్న సీఆర్పీ

భీమారం: బాలకార్మిక వవస్థ నిర్మూలనకు రాష్ట్ర విద్యాశాఖ చేపట్టిన చర్యల్లో భాగంగా మండలంలోని అంకూసాపూర్, తాళ్లగూడెం, బీసీ కాలనీల్లో శుక్రవారం బడిబయటి పిల్లలు గుర్తించేందుకు సర్వే చేపట్టారు. బడి మానేసిన పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలనే ఉద్దేశంతో సర్వే నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జి ఎంఈవో రాధాకృష్ణమూర్తి తెలిపారు. 6 నుంచి14 ఏళ్లలోపు, 15 నుంచి 19 ఏళ్లలోపు ఉన్నవారిని గుర్తిస్తున్నామని తెలిపారు. గుర్తించిన పిల్లల వివరాలను విద్యాశాఖ పోర్టల్‌లో నమోదు చేయనున్నామని పేర్కొన్నారు. జనవరి 10 వరకు సర్వే కొనసాగుతుందని ఇన్‌చార్జి ఎంఈవో తెలిపారు. సర్వేలో సీఆర్పీ సాగర్, ఐఐఆర్‌పీ సమ్మయ్య పాల్గొన్నారు.

తాండూర్‌లో..

తాండూర్: మండలంలో బడి బయటి పిల్లల సర్వే కొనసాగుతోంది. ఈనెల 11న బడి బయట ఉన్న పిల్లలను గుర్తించడానికి సర్వేను ప్రారంభించారు. ఇందులో భాగంగా కిష్టంపేటలో శుక్రవారం సీఆర్పీలు ఇంటింటికి వెళ్లి సర్వే చేశారు. మండల వ్యాప్తంగా సర్వే చేస్తున్నట్లు ఎంఈవో ప్రభాకర్ తెలిపారు. తల్లిదండ్రులు బడీడు పిల్లలను పాఠశాలలకు పంపించాలని కోరారు. సీఆర్పీలు తిరుపతి ,నాగరాజు పాల్గొన్నారు.

సృజనాత్మకతను పెంపొందించుకోవాలి



పరిశీలిస్తున్న ఎస్సై లక్ష్మణ్, తదితరులు

లక్సెట్టిపేట: విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని ఎస్సై లక్ష్మణ్ అన్నారు. మండల కేంద్రంలోని ట్రినిటీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సైన్స్ ఫేర్‌ను, విద్యార్థులు చేసిన పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు పరికరాలు చేయడం ద్వారా సైన్స్ ఇతర అంశాలపై అవగాహన ఉండేందుకు సైన్స్ ఫేర్ ఉపయోగపడుతుందన్నారు. ప్రిన్సిపాల్ జెసెఫ్, డైరెక్టర్ జోన్ డొమెనిక్, వైస్ ప్రిన్సిపాల్ రాహుల్, సతీశ్, ఉపాధ్యాయులు ఉన్నారు.